సంపుటి :03 | సంచిక :49 | పేజీలు :07 | www.aksharadarbar.com

అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

మంగళవారం 31, మార్చి 2026

## మహిళలకు 'మహాలక్ష్మి' ఎంతో ప్రయోజనం

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

03






## ఎన్ ఫోర్స్ మెంట్ విధులపై దృష్టి పెట్టాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం

03



## అలసత్వం వహిస్తే చర్యలు

ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరపాలి

నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

03

## కుటుంబ కలహాలతో విషాదం

- ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య
- భర్త ఇంటికి నిప్పు పెట్టిన బంధువులు



03




# అంగట్లో సరుకుల్లా ఆడబిడ్డలు

## అమ్మకానికి ఆదివాసీ యువతులు

- ఒక్కో యువతికి రూ. 2.5 లక్షల చొప్పు ధరకట్టి విక్రయం
- ఆసిఫాబాద్ టు మధ్యప్రదేశ్, రాజస్థాన్
- వ్యభిచార కూపంలోకి తోసివేత
- లేదంటే.. పెళ్లి పేరిట ఇష్టంలేని వివాహాలు
- తీవ్రంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

అడవులు, కొండ కోనల మధ్య జీవించే మూలవాసులు వారు. నిండా అమాయకత్వంతో జీవించే మనుషులు వారు. పోడు వ్యవసాయమే వారికి ఆధారం. అటవి సంపద అమ్ముకుంటేనే పూట గడిచేది. అలాంటి కల్మషం తెలియని గిరిజన గూడేల్లో మానవ అక్రమ రవాణా ముఠా కన్ను వేసింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ పల్లెల్లో జోరుగా యువతుల విక్రయం జరుగుతున్నది. అమాయక తల్లిదండ్రులకు దళారులు డబ్బు ఆశజూపి, ఆడబిడ్డలను కొని, వారిని మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కొందరికి ఎక్కువ ధరకు అమ్మేస్తున్నారు. అందమైన జీవితం చూపిస్తామని యువతులకు ఎర వేస్తున్నారు.

– అక్షరదర్బార్, వరంగల్

02

## ఎల్కతుర్తిలో దొంగల బీభత్సం

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

03



## మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నా.. లొంగిపోండి!

మావోయిస్టు అగ్రనేతకు మరోసారి డీజీపీ పిలుపు

అడవిబాట వీడి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి

అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ

05

# అంగట్లో సరుకుల్లా ఆడబిడ్డలు

- అమ్మకానికి ఆదివాసీ యువతులు
- ఒక్కో యువతికి రూ. 2.5 లక్షల చొప్పున ధర కట్టి విక్రయం
- ఆసిఫాబాద్ టు మధ్యప్రదేశ్, రాజస్థాన్
- వ్యభిచార కూపంలోకి తోసివేత
- లేదంటే.. పెళ్లి పేరిట ఇష్టంలేని వివాహాలు
- తీవ్రంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం



**అక్షరదర్బార్, వరంగల్ :**

ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో మానవ అక్రమ రవాణా దందా సాగుతున్నది. దళారులు అక్కడంతా మూగి అమాయక ఆదివాసీ ఆడబిడ్డలను తరలిస్తున్నారు. మైనర్ బాలిక అయితే ఒక రేటు కడుతున్నారు. వివాహమైన మహిళ అయితే మరో రేటు కడుతున్నారు. ఒంటరిగా ఉండే మహిళలకు ఇంకో రేటు. ఇలా ప్రతీ మనిషికీ దళారులు ఓ ధర నిర్ణయించారు. తాజాగా బెజ్జూర్ మండలానికి చెందిన ఇద్దరు యువతులను ఒక్కొక్కరిని రూ. 2.5 లక్షల చొప్పున విక్రయించిన వైనం వెలుగులోకి వచ్చింది. పోలీసులు రంగంలోకి దిగి ముగ్గురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. ఈ దారుణాల వెనుక ఉన్నది హరిదాసు అనే ఒక పోలీసు కానిస్టేబుల్ కావడం విస్తుపోయే విషయం.

### - దందా ఇలా

మంచిర్యాలకు చెందిన విజయ లక్ష్మి, ఆసిఫాబాద్‌కు చెందిన సుజాత, పంచపూల భైర ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా జిల్లాలోని అమాయక యువతులను బుట్టలో వేసుకుంటారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బసీర్ రమేష్ గౌడ్ ముఠాకు వీరిని అప్పగిస్తారు. గత ఏడాది వాడిగొందికి చెందిన యువతిని రూ. 1.30 లక్షలకు అమ్మేశారు. అడ్రస్ మార్పు విషయంలో వచ్చిన తేడాతో ఆ యువతి అక్రమ రవాణా గుట్టు బయటపడింది. ఆ యువతిని వ్యభిచార కూపంలోకి తోసేందుకు ప్రయత్నించడం సభ్య సమాజం తలదించుకునే విషయం. ఈ అక్రమ రవాణా వెనుక పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోంది. పేద గిరిజన కుటుంబాల అవసరాలను వీరు పసిగడతారు. పెళ్లి చేసుకుంటే జీవితం సెటిల్ అవుతుందని నమ్మిస్తారు. కన్నవారికి కొంచెం డబ్బు ఆశ చూపుతారు. తీరా సరిహద్దులు దాటాక అసలు రంగు బయటపడుతుంది. హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు తరలించి అక్కడ బానిసలుగా మారుస్తున్నారు. ఈ దారుణాలపై పోలీసులు నిఘా పెంచారు. జిల్లా సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ముఠా సభ్యులందరినీ పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

### - ఆడబిడ్డల జోలికి వెళ్తే జైలుకే: మంత్రి సీతక్క

పెళ్లిళ్ల పేరుతో ఆదివాసీ ఆడబిడ్డలను వేధిస్తే ఎంతటి వారైనా కటకటాలు లెక్కపెట్టాల్సిందే. తీవ్రమైన కఠిన చర్యలు తీసుకుంటాం. గిరిజన మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని విక్రయాలకు పాల్పడితే పాతాళంలో ఉన్నా వదిలిపెట్టం. గత ప్రభుత్వం గ్రామాలను, గిరిజన ప్రాంతాలను గాలికొదిలేసింది. నేను గిరిజన బిడ్డగా పుట్టా. నా బిడ్డలకు నేనే రక్షణగా ఉంటాను. మా ప్రభుత్వం మహిళలు స్వేచ్ఛగా, గౌరవంగా బతికే వాతావరణం కల్పిస్తాం. ఆడబిడ్డలను అంగట్లో సరుకుల్లా చూసేవారి ఆటలు సాగనివ్వం. గిరిజన మహిళల రక్షణ కోసం ప్రభుత్వం వైపు నుంచి అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకుంటాం.

## కేయూ హాస్టళ్లలో ఎలుకల బెడద

- 14 మంది విద్యార్థులకు గాయాలు




అక్షరదర్బార్, హనుమకొండ : కాకతీయ యూనివర్సిటీ (కేయూ) పరిధిలోని సమ్మక్క-సారలమ్మ హాస్టల్‌తో పాటు మరి కొన్ని భవనాలు ఎలుకల నిలయాలుగా మారాయి. విద్యార్థులు నిద్రిస్తున్న విద్యార్థులను ఎలుకలు కరుస్తున్నాయి. అలా ఇప్పటివరకు 14 మంది విద్యార్థులు పాదాలకు గాయాలయ్యాయి. హాస్టల్ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, అపరిశుభ్రమైన వాతావరణం ఉండటం వల్లే ఎలుకలు భారీగా చేరుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిటికీలకు మెష్‌లు లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, పరిసరాలను సకాలంలో శుభ్రం చేయకపోవడం వంటివి ఈ పరిస్థితికి కారణమని వారు మండిపడుతున్నారు. హాస్టల్ సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని, కిటికీలకు జాలీలు బిగించాలని SFI జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ మరియు ఇతర విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ఇంతలా నిర్లక్ష్యం వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

## పారదర్శకంగా నిధుల వినియోగం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ఆమోదం, పట్టణంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. పట్టణంలోని 30 వార్డుల కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా మురుగునీటి పారుదల, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారుల నిర్మాణం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. భూపాలపల్లి పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు బడ్జెట్ నిధులను పారదర్శకంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. వార్డుల వారీగా సమస్యల ప్రాధాన్యతను బట్టి నిధులు కేటాయించాలని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో అలసత్వం వహించకూడదని పేర్కొన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయ వనరులపై దృష్టి సారించాలని, బకాయిల వసూలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ ఇంజనీర్లు, ఏఈలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.






## రూ.92 కోట్లతో బడ్జెట్ ఆమోదం

- మానుకోట పట్టణ అభివృద్ధికి కృషి చేయాలన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

అక్షరదర్బార్, మహబూబాబాద్: పట్టణాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం మహబూబాబాద్‌లోని మునిసిపల్ సమావేశ మందిరంలో జరిగిన మహబూబాబాద్ మున్సిపల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ మునిసిపల్ చట్టం-2019 పై ప్రతి ఒక్క వార్డు కౌన్సిలర్లు, అధికారులు అవగాహన ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలను సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని సూచించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మొదటిసారిగా పాల్గొన్న కౌన్సిల్ సభ్యులను అభినందించారు. పట్టణం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయడంతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా వార్డుల్లో పర్యటిస్తూ చెత్త తొలగింపు, డ్రైనేజీలను శుభ్రపరచడం, రోడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మునిసిపాలిటీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.92 కోట్ల 68 లక్షల 69 వేల ఆదాయం, రూ.92 కోట్ల 66 లక్షల 70 వేల వ్యయంతో బడ్జెట్ ను ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, చైర్ పర్సన్ జ్యోతి రమేష్, వైస్ చైర్ పర్సన్ సూర్ణపు సోమయ్య, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు 247 కోట్లు

- 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్ విడుద ల
- సదుపాయాల కల్పనకు లైన్ క్లియర్

అక్షరదర్బార్, హైదరాబాద్: గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సులను అమలు చేస్తూ మంగళవారం తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు రూ.1,500 కోట్లకు పైగా గ్రాంట్లను విడుదల చేస్తూ కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగానే తెలంగాణ పల్లెలకు రూ. 247.94 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులు 202 5-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత 'అన్‌టైడ్ గ్రాంట్స్ అని పేర్కొంది. నిధులను పాలకవర్గాలు గ్రామసభలు నిర్ణయించిన పనులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం మాత్రమే వినియోగించాలి. సిబ్బంది జీతాల చెల్లింపులకు లేదా కార్యాలయ నిర్వహణ ఖర్చులకు వాడకూడదు. నిధులు నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లోకి చేరడం వల్ల క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులకు వేగం పుంజుకోనుంది. గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, స్థానిక స్వపరిపాలనలో పారదర్శకతను పెంచడం కోసమే నిధులు కేటాయించినట్లు కేంద్రం స్పష్టం చేసింది.

www.aksharadarbar.com
అక్షర దర్బార్
Voice of the people



# డా. కాళీ ప్రసాద్ రావుకు ఘన సన్మానం

అక్షరదర్బార్, పరకాల: పరకాల బిజెపి కాంటెస్టెంట్ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావును బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంపికైన సందర్భంగా పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వానికి ఆకర్షితుడై పార్టీలో చేరిన డా. కాళీ ప్రసాద్ రావు 2023 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి సుమారు 40 వేల ఓట్లు సాధించారని తెలిపారు. ప్రజా సేవలో ఆయన చురుకైన పాత్రను గుర్తించి పార్టీ ఈ పదవి అప్పగించిందన్నారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి. జయంతిలాల్, కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, మిడిదొడ్డి నరేష్ పాల్గొన్నారు.




# ఉచిత బస్సు ప్రయాణం వెలకట్టలేనిది

- మహిళా సంఘాలే అసలైన శక్తికి నిదర్శనం
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

అక్షర దర్బార్ /ములుగు జిల్లా ప్రతినిధి : మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఉత్సవాలు–2026" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్ల ప్రయాణాలు జరిగి సుమారు రూ.10 వేల కోట్ల ఆదా సాధ్యమైందన్నారు. ములుగు జిల్లాలోనే 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా రూ.133 కోట్లకు పైగా ఆదా అయినట్లు తెలిపారు.ఈ పథకం కూలీ కార్మికులు, మధ్యతరగతి మహిళలు, ఉద్యోగినులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, ఆర్టీసీ డి.ఎం. రవిచందర్, అడిషనల్ డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# 'నో' సిలిండర్

- బజ్జీల బండ్లకు మాత్రం 'ఎస్'!
- డొమెస్టిక్ గ్యాస్ దుర్వినియోగం..
- పరకాలలో వినియోగదారుల ఆవేదన

అక్షరదర్బార్, పరకాల: పట్టణంలో గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా కనిపిస్తుండటంతో గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. గృహాలకు అవసరమైన డొమెస్టిక్ సిలిండర్లు సమయానికి అందకపోయినా, బజ్జీల బండ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లకు మాత్రం సులభంగా అందుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిలిండర్ బుకింగ్ చేసినప్పటికీ 10 రోజులు గడిచినా


సరఫరా జరగడం లేదని గృహిణులు ఆవేదన వ్యక్తం

చేస్తున్నారు. గ్యాస్ గోదాముల వద్దకు వెళ్లినా సరైన సమాధానం ఇవ్వకుండా తిప్పికొడుతున్నారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, గ్యాస్ డీలర్లు డొమెస్టిక్ సిలిండర్లను అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయిస్తూ, బజ్జీల బండ్లు, హోటళ్లకు సరఫరా చేస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. కమర్షియల్ సిలిండర్లు ఉపయోగించాల్సిన వ్యాపార సంస్థలు డొమెస్టిక్ గ్యాస్ వినియోగించడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదని చెబుతున్నప్పటికీ, పరకాలలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందని ప్రజలు అంటున్నారు. డీలర్లు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తూ వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు, సంబంధిత అధికారులు కేవలం నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డొమెస్టిక్ గ్యాస్ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సాధారణ ప్రజలకు సమయానికి గ్యాస్ సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని, అక్రమంగా సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# రిటైర్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల: పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. నడికూడ మండలం కౌకొండ ఉన్నత పాఠశాలలో జరిగిన వింజమూరి మనోరమ పదవి విరమణ సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిల చెల్లింపుల్లో ఆలస్యం కారణంగా పలువురు ఉద్యోగులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ, నగదు రహిత హెల్త్ కార్డు, సర్వీస్ రూల్స్, ప్రమోషన్ల కోసం కృషి చేస్తాన



న్నారు.మూడు దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించిన మనోరమకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆమె శేష జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. అనంతరం మనోరమ దంపతులను ఘనంగా సన్మానించారు.

# ఏప్రిల్ 2న ఆంజనేయ కళ్యాణం

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండలం మల్లక్కపేట గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ఏప్రిల్ 2న ఆంజనేయ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అంభీరు మహేందర్, ఆలయ అర్చకులు జగన్నాథ ఆచార్యులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక పూజలు, హోమాలు, కల్యాణోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం నుంచే ఆలయంలో పూజలు ప్రారంభమై, అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగనుంది. భక్తుల కోసం తాగునీరు, అన్నప్రసాదం ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.



# 45 ఏళ్ల సేవలకు ముగింపు..

## పారిశుధ్య కార్మికురాలికి సన్మానం

అక్షర దర్బార్,పరకాల: పరకాల మున్సిపల్ కార్యాలయంలో 45 సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికురాలిగా సేవలందించిన బొచ్చు రాజమ్మ పదవీ విరమణ పొందిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్, వార్డు కౌన్సిలర్ బొచ్చు మాధవిలత జాన్సన్ పాల్గొని రాజమ్మ సేవలను కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపారు.మున్సిపల్ సిబ్బంది, కుటుంబ



సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు అభినందనలు తెలిపారు.

# లక్ష్యాన్ని ఛేదించిన తాడిచర్ల-1 ఓపెన్ కాస్ట్

- 25 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో సరికొత్త రికార్డు
- సేఫ్టీలో బెస్ట్.. మైనింగ్ లో ఫైవ్ స్టార్ రేటింగ్

అక్షర దర్బార్ మల్హర్ : నిరంతర కృషి, సమష్టి పట్టుదల ఉంటే అసాధ్యమైనది ఏదీ లేదని తాడిచర్ల–1 ఓపెన్ కాస్ట్ మైన్ మరోసారి నిరూపించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని మైన్ విజయవంతంగా చేరుకుంది. ఈ మేరకు ఏఎన్ఆర్ (AMR) కంపెనీ వైస్ ప్రెసిడెంట్లు ప్రభాకర్ రెడ్డి, కేవీఎన్ మూర్తి వివరాలను వెల్లడించారు.

### విజయ కేతనం:

కీలక మైలురాయి: ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల (25 లక్షల టన్నులు) బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించి, మైనింగ్ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది.

- శత శాతం ఓవర్ బర్డెన్: ఉత్పత్తితో పాటు 100 శాతం ఓవర్ బర్డెన్ (మట్టి తొలగింపు) లక్ష్యాన్ని కూడా పూర్తి చేయడం విశేషం.
- ఎండీ అభినందనలు: కార్మికులు, అధికారులు మరియు ఉద్యోగుల అంకితభావానికి ఫిదా అయిన కంపెనీ ఎండి మహేష్ రెడ్డి, వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే సమన్వయంతో భవిష్యత్తులోనూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### సేఫ్టీలో మేటి.. రేటింగ్ లో గ్రేట్!

కేవలం ఉత్పత్తిలోనే కాకుండా, భద్రతలోనూ ఈ మైన్ తన ముద్ర వేసింది. ఏ చిన్న ప్రమాదం జరగకుండా 'బెస్ట్ సేఫ్టీ ప్రాక్టీస్' అవార్డును దక్కించుకోవడంతో పాటు, ప్రతిష్టాత్మకమైన 'మైన్ ఫైవ్ స్టార్ రేటింగ్' సాధించి రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ అద్భుత విజయానికి కారకులైన ప్రతి ఒక్కరికీ వైస్ ప్రెసిడెంట్లు మరోమారు కృతజ్ఞతలు తెలియజేశారు.



# 'మహాలక్ష్మి' తో మహిళలకు భారీ ఆదా

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

**లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

అక్షర దర్బార్,పరకాల: రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా రూ.10 వేల కోట్లకు పైగా ఆదా కావడంతో పరకాల బస్టాండ్‌లో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం ప్రారంభం నుంచి కోట్లాది మహిళలు ప్రయాణించి గణనీయమైన ఆదా పొందినట్లు తెలిపారు. పరకాల డిపో నుంచే లక్షలాది మహిళలు ప్రయాణించి కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని చెప్పారు. త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు, చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం మహిళా ప్రయాణికులను సన్మానించారు.ఇదే సందర్భంలో అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 65 మందికి రూ.65 లక్షలు, 87 మందికి రూ.34 లక్షలకు పైగా చెక్కులు అందజేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆర్ డి ఓ డా. నారాయణ, తహసిల్దార్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ పావుశేటి సునీల్ కుమార్, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాధనం దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి



అక్షర దర్బార్ శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామంలో విద్యుత్ పనుల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి తాడికొండ రవికిరణ్ ప్రభుత్వాన్ని కోరారు.ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ విద్యుత్ లైన్ వల్ల సమీప ఇళ్లకు ప్రమాదం ఉందని తెలిపారు. అవసరం లేకపోయినా రెండు పోల్స్ సరిపోతే 20 పోల్స్ ఏర్పాటు చేస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. ఈ పనుల కోసం రూ.5 లక్షలు సరిపోతే, రూ.25 నుండి 30 లక్షల వరకు ఖర్చు చూపుతున్నారని అన్నారు.స్థానిక ప్రజలు నిరసన వ్యక్తం చేయగా వారిపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేశారని, గృహాలకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే విచారణ జరిపి, అవసరమైన ఇళ్ల వరకే లైన్ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నా.. లొంగిపోండి!

- మావోయిస్టు అగ్రనేతకు మరోసారి డీజీపీ పిలుపు
- అడవిబాట వీడి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి
- అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ





అక్షరదర్బార్, హైదరాబాద్: హింసకు భవిష్యత్తు లేదు.. శాంతికి మాత్రమే ఉంది అంటూ డీజీపీ శివధర్‌రెడ్డి మంగళవారం మావోయిస్టు అగ్రనేత గణపతితో పాటు మిగిలిన మావోయిస్టులకూ విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉంటూ ఉద్యమాన్ని నడిపిస్తున్న నేతలు, తక్షణమే లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, వార్తా శేఖర్ అలియాస్ మంగ్తూ, జోడే రత్నబాయి అలియాస్ సుజాత, నక్కా సుశీల అలియాస్ రేల, రంగబోయిన భాగ్య అలియాస్ రూపి ఇప్పటికీ అడవిలోనే ఉన్నారని, వీరంతా తమ కుటుంబాల వద్దకు తిరిగి రావాలని, వారికి ప్రభుత్వం తరపున పూర్తి రక్షణ, భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గడిచిన రెండేళ్లలో ప్రభుత్వ పునరావాస విధానంపై నమ్మకంతో 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ వెల్లడించారు. వారంతా ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక, సామాజిక సహకారంతో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉంటూ వయసు పైబడటం వల్ల లేదా ఇతర కారణాల వల్ల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నేతలకు మెరుగైన, అధునాతన వైద్య చికిత్సలు అందిస్తామని ప్రత్యేకంగా హామీ ఇచ్చారు. "మీ క్షేమం మాకు ముఖ్యం. ప్రజాస్వామ్యం, అభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన 'మావోయిస్టు రహిత సమాజం' గడువు సమీపిస్తున్న వేళ, తెలంగాణ పోలీస్ బాస్ నుంచి వచ్చిన ఈ ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ సానుకూల ధోరణికి స్పందించి అగ్రనేతలు శాంతిబాట పడతారో లేదో వేచి చూడాలి.



# ప్రజా సేవలో ములుగు పోలీసులు

అక్షర దర్బార్ /ములుగు జిల్లా ప్రతినిధి : ప్రజల భద్రత కోసం ములుగు పోలీసులు ప్రత్యేక చొరవ చూపుతూ "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఇంచెర్లలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఎం ఆర్ గార్డెన్స్‌లో జరిగిన ఈ శిబిరంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా. వేణుమాధవ్ బృందం సహకారంతో సుమారు 300 మంది డ్రైవర్లు, వాహన యజమానులు, గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు.పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేయగా, కొందరిని మెరుగైన చికిత్స కోసం ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ కిషోర్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కంటి చూపు కీలకమని, ముఖ్యంగా డ్రైవర్లు కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ములుగు డిఎస్పి కిషోర్ కుమార్ , ములుగు సిఐ డి సురేష్ , ములుగు వెంకటాపూర్ ఎస్సైలు యు. ఉపేందర్, సిహెచ్ రాజు , ములుగు ఆర్టీవో బీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలంలోని ఒడితల రైతు వేదికలో మంగళవారం ఏవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు కృషి సఖిలకు ప్రకృతి వ్యవసాయంపై ట్రైనింగ్ , అధిక పురుగుమందుల వాడకం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ రమణకుమార్, ఎన్జీవో జిల్లా నోడల్ ఆఫీసర్ మణికుమార్ వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర**



అక్షర దర్బార్ శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటైంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తమ పంటలను మధ్యవర్తుల వద్ద కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఎనిమిది మండలాలకు ఎనిమిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.కేంద్ర ప్రభుత్వం పరిమితంగా మక్కజొన్న కొనుగోలు చేస్తోందని, మిగిలిన కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు సరైన ధర లభించి మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీ మారపల్లి రవీందర్, స్థానిక సర్పంచ్ చింతల ఉమ రవిపాల్ , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్ వెంకట్ రాజిరెడ్డి,పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, చిట్టిరెడ్డి,రాజిరెడ్డి సర్పంచ్ గజ్జి ఐలయ్య, చిందం రవి, కుమార స్వామి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**ఎంఈవో లింగాల కుమారస్వామి**



అక్షర దర్బార్, మొగుళ్ళ పల్లి: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎంఈఓ లింగాల కుమారస్వామి పేర్కొన్నారు. మండలంలోని వేములపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసిన గుర్రం రాజ్ దీప్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, వారి జీవితం ఆదర్శప్రాయమని తెలిపారు. 36 సంవత్సరాల సేవలో రాజ్ దీప్ విద్యార్థుల అభివృద్ధికి విశేష కృషి చేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా వారి అనుభవం సమాజానికి ఉపయోగపడుతుందని అన్నారు.అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అరెల్ల రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పోచంపల్లి మమత తదితరులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి పరామర్శ..

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి( సి) చెందిన తూముల నరసింహ రాములు అనారోగ్యంతో చనిపోగా ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబానికి చిట్యాల మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్ రవీందర్ మాజీ సర్పంచ్ చిలుకల రాజకొమురు మండల యువజన నాయకులు అల్లంరాజులు మనోధైర్యం కల్పించారు.

# కుటుంబ కలహాలతో విషాదం

- ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య
- భర్త ఇంటికి నిప్పు పెట్టిన బంధువులు

అక్షరదర్బార్, చెన్నారావుపేట: బతుకుదెరువు కోసం వెళ్ళిన ఆ కుటుంబంలో పెను విషాదం నిండింది. నమ్ముకున్న భర్తే కాలయముడు కావడంతో, మనస్తాపం చెందిన ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులను చంపి, తాను కూడా బలవన్మరణానికి పాల్పడిన హృదయవిదారక ఘటన హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో చోటుచేసుకుంది. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని బోడ మాణిక్య తండాలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.



## - ఘటన వివరాల్లోకి వెళ్తే..

చెన్నారావుపేట మండలం బోడ మాణిక్య తండాకు చెందిన బోడ స్రవంతి, ప్రవీణ్ దంపతులు కొన్నాళ్ల క్రితం ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. కూకట్‌పల్లి ప్రాంతంలో నివసిస్తున్న వీరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. భర్త ప్రవీణ్ పెడుతున్న వేధింపులు భరించలేక, తీవ్ర మనస్తాపానికి గురైన స్రవంతి.. తన ఇద్దరు బిడ్డలను హతమార్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకుంది.

## - స్వగ్రామంలో నిరసన జ్వాలలు

స్రవంతి మరణవార్త ఆమె స్వగ్రామమైన బోడ మాణిక్య తండాకు చేరడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్రవంతి ఆత్మహత్యకు భర్త వేధింపులే కారణమని ఆగ్రహించిన మృతురాలి బంధువులు, గ్రామస్థులు ప్రవీణ్ ఇంటిపై దాడికి దిగారు. ఆగ్రహావేశాలతో నిందితుడు ప్రవీణ్ ఇంటిని, లోపల ఉన్న ఫర్నిచర్‌ను తగలబెట్టారు. దీంతో తండాలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# మహిళలకు ఎంతో ప్రయోజనం 'మహాలక్ష్మి'

## హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 2023 డిసెంబర్ 9 నుంచి ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఇప్పటి వరకు మహిళలు సుమారు 290 కోట్ల ప్రయాణాలు చేసి దాదాపు రూ.10,000 కోట్ల మేర ఆదా చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా హనుమకొండ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పథకాన్ని అన్ని వర్గాల మహిళలు విస్తృతంగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నిత్యం బస్సుల్లో ప్రయాణించే పలువురు మహిళలను అధికారులు సత్కరించారు.

# అలసత్వం వహిస్తే చర్యలే

- ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరపాలి
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



అక్షరదర్బార్, భూపాలపల్లి: జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ, మిస్సింగ్ కేసుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని సూచించారు. అత్యాచార, పోక్సో కేసులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి నిందితులను కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, సమయానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో దొంగల బీభత్సం

## - తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

అక్షరదర్బార్, ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఒక ఇంట్లోకి చొరబడిన దుండగులు భారీగా నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు, ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో భద్రపరిచిన బంగారు నగలు, వెండి వస్తువులతో పాటు కొంత నగదును అపహరించుకుపోయారు. తిరిగి వచ్చి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా పడి ఉండటం, విలువైన వస్తువులు కనిపించకపోవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## - రంగంలోకి పోలీసులు

చోరీ సమాచారం అందుకున్న ఎల్కతుర్తి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. వరుస దొంగతనాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడికైనా వెళ్లేటప్పుడు పోలీసులకు లేదా పొరుగు వారికి సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు.

# రేపటి నుంచి చికెన్ షాపులు బంద్

- పౌల్ట్రీ కంపెనీలపై వ్యాపారుల నిరసన
- మార్జిన్ పెంచే వరకు కొనసాగుతుందని స్పష్టీకరణ

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణవ్యాప్తంగా బుధవారం నుంచి చికెన్ షాపులు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా 'తెలంగాణ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్' ఈ బంద్‌కు పిలుపునిచ్చింది. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే కమీషన్ మార్జిన్‌ను భారీగా తగ్గించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మార్జిన్‌ను తగ్గించడంపై వారు మండిపడుతున్నారు. పెరిగిన షాపు అద్దెలు, కరెంటు బిల్లులు, పనివారి జీతాల దృష్ట్యా ఈ మార్జిన్‌తో వ్యాపారం చేయడం సాధ్యం కాదని వారు స్పష్టం చేస్తున్నారు. కేవలం బంద్ మాత్రమే కాకుండా, తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టాలని అసోసియేషన్ నిర్ణయించింది. మార్జిన్ పెంపుపై కంపెనీలు దిగివచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని నాచారం అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. యజమానులందరూ ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్ కోరింది. ఒకవేళ ఎవరైనా అసోసియేషన్ నిర్ణయాన్ని ధిక్కరించి షాపులు తెరిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ చికెన్ షాప్స్ అసోసియేషన్ గట్టిగా హెచ్చరించింది. హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రధాన నగరాల్లోనూ ఈ బంద్ ప్రభావం ఉండనుంది. పౌల్ట్రీ యజమానులు, కంపెనీల మధ్య చర్చలు విఫలమైతే ఈ సమ్మె మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది.

# ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులపై దృష్టి పెట్టాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం



అక్షరదర్బార్, హనుమకొండ: కమిషనరేట్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాతో పాటు, గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం, పేకాటను ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ ఫోర్స్మెంట్ ద్వారా నియంత్రించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాలలో నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆయన సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ కమిషనరేట్ పరిధిలో పేకాటరాయుళ్ళపై కఠినంగా వ్యవహరించాలని, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని, చోరీలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని, స్టేషన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని అన్నారు. గంజాయి వినియోగదారులను పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని అనుకోకుండా గంజాయిని విక్రయించే వారిని గుర్తించి అరెస్టు చేయాలని చెప్పారు. రాబోవు హనుమాన్ జయంతి వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికల సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత, జనగామ ఏఎస్పీ చేతన్, ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, అదనపు డీసీపీలు ప్రభాకర్, రవి, బాలస్వామి, శ్రీనివాస్ తో పాటు ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# సాధారణ మహాసభ

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట చేనేత సహకార సంఘంలో సంఘ పర్సన్ ఇంచార్జి బి.సునీత అధ్యక్షతన 64వ వార్షిక 81వ అర్ధ సంవత్సర సాధారణ మహాసభ జరిగింది. ఈ మహాసభలో గత 6 నెలలో జరిగిన వ్యాపార లావాదేవీల గురించి నివేదిక ద్వారా సంఘ సభ్యులకు తెలియజేయడం జరిగింది.ఈ మహాసభ కు సంబంధిత అధికారి బొట్టు వెంకటేశ్వర్లు డిఎంఒ,మాజీ అధ్యక్షులు బాసని రవి.డిడ్డి రమేష్ ,మామిడి శంకర్ లింగం,పద్మశాలి కుల పెద్దలు, కుల బాంధువులు మరియు సంఘ కార్మికులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915